

జై భీమ

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 340 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 11, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



కులం గొప్పలు.. ప్రజలకు తిప్పలు!

● సామాజిక వర్గాలకు సకల సౌకర్యాలు ● దేశంలో వేగంగా మారిపోతున్న కుల సమీకరణాల ఆధిపత్యాలు ● కులాల పేరు చెప్పుకొని ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారు ● రాజకీయ పార్టీలన్నీ కులాలను పెంచి పోషిస్తున్నాయి ● ప్రజాసేవ మనగడ కులకంపులో నలిగిపోతుంది ● కులాధిపత్యం సమాజానికి ప్రమాదం ● కులం ముసుగులో రాజ్యాధికారాలు సాధిస్తున్నారు ● కులమే మనిషిని మతరూపికులను తయారుచేస్తుంది ● అగ్రకులాలన్నీ ఆధిపత్యం వైపే ఉన్నాయి ● పేదోడికి బతుకునివ్వలేని కుల దరిద్రం ● రిజర్వేషన్ల హక్కులను శాసిస్తున్న కులాధిపత్యం ● సామాన్యుల హక్కులపై రంకెలేస్తున్న రాజకీయం ● డాక్టర్ బరిగెల శివ

దేశంలో కుల సమీకరణాలు రాజకీయాలను, అధికార వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కులం పేరుతో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ రాజకీయ పదవులు, అధికార అవకాశాలను కొందరు తమ వర్గాలకే పరిమితం చేస్తున్నారని డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు. ప్రజాసేవ కుల రాజకీయాల మధ్య నలిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పోటీ చేసే అవకాశాల్లో అన్ని సామాజిక వర్గాలకు సమాన ప్రాధాన్యత దక్కడం లేదని విమర్శించారు. నామినేటెడ్ పదవులు, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాల్లోనూ కుల ప్రాధాన్యత పెరుగుతోందని పేర్కొన్నారు. కుల అహంకారం మానవత్వాన్ని మరుగున పడేస్తోందని అన్నారు. ఆధిపత్య వర్గాల ప్రయోజనాల కోసం చిన్న సామాజిక వర్గాలను రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. అవినీతి, అధికార దుర్వినియోగానికి కులం రక్షణ కవచంగా మారకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థల్లో అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కుల ఆధిపత్యం కాకుండా సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికగా పాలన సాగాలని సూచించారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2



డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా అమిత్ షా పిలుపు!


2029 డిసెంబర్ 31 నాటికి దేశవ్యాప్తంగా లక్ష్య సాధన

2028 చివరికల్లా గుజరాత్‌ను డ్రగ్స్ రహితంగా మారుస్తాం

డిసెంబర్ 1 నుంచి డ్రగ్స్ సమాచారానికి 1033 హెల్ప్‌లైన్

అహ్మదాబాద్‌లో రూ.1,400 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం కీలకం



2



రూ.4 లక్షల రుణానికి రూ.9.23 లక్షలు చెల్లించాలా?

ఫైవ్ స్టార్ ఫైనాన్స్ తీరుపై సుధాకర్ ఆవేదన..

మారటోరియం పేరుతో మరో రూ.లక్ష డిమాండ్!

2

సార్వత్రిక ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ అంశాలపై సమ్మిట్‌లో చర్చలు

భారత్ సమ్మిట్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

6

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా విధులు నిర్వర్తించాలి

ప్రొబేషనరీ డీఎస్పీలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

నిబద్ధతతో పనిచేస్తే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుంది..

పోలీసుల పనితీరే ప్రభుత్వానికి గీటురాయి

గ్రూప్-1 ద్వారా 562 పోస్టుల భర్తీ.. 119 మంది డీఎస్పీలుగా ఎంపిక

హైద్రాబాద్, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగేలా నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వర్తించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రొబేషనరీ డీఎస్పీలకు సూచించారు. పోలీసు అధికారుల పనితీరే ప్రభుత్వానికి గీటురాయిగా మారుతుందని, క్షేత్రస్థాయిలో ప్రజలతో నేరుగా మమేకమై పనిచేసే బాధ్యత పోలీసు అధికారులపై ఉందని స్పష్టం చేశారు. పది మంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయనే అభిప్రాయం ఏర్పడుతుందని, అదే పది మంది అధికారులు నిబద్ధతతో, నిటారుగా నిలబడి విధులు నిర్వర్తిస్తే రాష్ట్ర ప్రతిష్ఠ దేశవ్యాప్తంగా పెరుగుతుందని అన్నారు. ప్రజల్లో పోలీసు శాఖపై ఉన్న నమ్మకాన్ని, గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత కొత్తగా నియమితులైన అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ సంస్థలో శిక్షణ పూర్తి చేసుకున్న నూతన ప్రొబేషనరీ డీఎస్పీల వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ సమయంలో ట్రైయినీ అధికారులు తీసుకున్న ఫొటోల ప్రదర్శనను తిలకించారు. అనంతరం 'క్రైమ్ సీన్ ఫోరెన్సిక్స్' హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో

- మిగతా 2లో..



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా అమిత్ షా పిలుపు!

2029 డిసెంబర్ 31 నాటికి దేశవ్యాప్తంగా లక్ష్య సాధన
2028 చివరికల్లా గుజరాత్‌ను డ్రగ్స్ రహితంగా మారుస్తాం
డిసెంబర్ 1 నుంచి డ్రగ్స్ సమాచారానికి 1033 హెల్ప్‌లైన్
అహ్మదాబాద్‌లో రూ.1,400 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం
మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం కీలకం

అహ్మదాబాద్, జై భీమ్ న్యూస్

2028 డిసెంబర్ 31 నాటికి గుజరాత్‌ను పూర్తిగా మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 'డ్రగ్ ఫ్రీ ఇండియా' సాధనకు 2029 డిసెంబర్ 31ని గడువుగా నిర్ణయించామని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ, తానూ గుజరాత్‌కు చెందినవారమే కావడంతో రాష్ట్రం ఏడాది ముందుగానే ఈ లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సుమారు రూ.1,400 కోట్ల విలువైన అభివృద్ధి పనులను అమిత్ షా ప్రారంభించారు. వీటిలో ఇస్కాన్-సనంద్ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు పలు గృహ నిర్మాణ ప్రాజెక్టులు ఉన్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చిన తర్వాత తదుపరి ప్రధాన లక్ష్యం డ్రగ్స్ రహిత భారత్‌ను నిర్మించడమేనని అన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం డిసెంబర్ 1 నుంచి '1033' టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ప్రజలు ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చే నిధులు ఉగ్రవాద కార్యకలాపాలకు చేరుతున్నాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అమిత్ షా పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలని సూచించారు. బాధితులకు చికిత్స అందించేందుకు డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వారి వివరాలను కూడా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

నేర నియంత్రణపై నిఘా ఉంచుతూ .. ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి గితే

రాజన్న సిరిసిల్ల, జై భీమ్ న్యూస్

ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది విధులు, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలను సమీక్షించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..నేర నియంత్రణపై నిరంతరం అప్రమత్తంగా ఉంటూ రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు స్టేషన్ పరిధిలో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన కేసుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా కేసులు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులు, రిజిస్టర్లను క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, కేసులకు సంబంధించిన వాహనాలను భద్రపరచాలని ఆదేశించారు.పోలీస్ అధికారులు బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, గ్రామాల్లో రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణయే లక్ష్యంగా ప్రతి రోజు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ ఉపేంద్ర చారి, లక్ష్మి, సిబ్బంది ఉన్నారు

18న నితిన్ నబిన్ మహాపాదయాత్రకు హాజరై మద్దతివ్వండి

కరీంనగర్, జై భీమ్ న్యూస్

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే పూచీ నాది. కేంద్ర, రాష్ట్రాల సహకారంతో అభివృద్ధి చేస్తున్నా. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ సహకారంతో కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తెస్తున్నా. అండగా నిలిచి మరింత ఆదరించండి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు విజ&ఋప్తి చేశారు. ఈ నేపథ్యంలో "సర్" పేరిట రాజ్యాంగ సంస్థలపై విపక్షాలు చేస్తున్న దాడిని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ఈనెల 18న కరీంనగర్ వస్తున్నారని, నిర్వహించే మహాపాదయాత్రకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రతి ఒక్కరూ హాజరై మద్దతు తెలపాలని కోరారు. 50 వ డివిజన్ లోని జ్యోతినగర్ ఎక్స్‌ప్లోరికా స్కూల్ సమీపంలో రూ. 79.20 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న ఆర్.సి.సి. డ్రైన్, స్లాబ్ కల్వర్ట్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్ రావులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో కాసేపు ముచ్చటించారు. కరీంనగర్ పార్లమెంట్ ను అన్ని విధాలా అభివృద్ధి చేసే పూచీ నాది. మోదీ, అమిత్ షా, నితిన్ నబిన్ సహకారంతో కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తెస్తున్నా. అభివృద్ధి పనులు చేస్తున్నా. ఈనెల 18న నితిన్ నబిన్ తొలిసారి కరీంనగర్ కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న మహా పాదయాత్ర కు కరీంనగర్ పార్లమెంట్ నుండి ప్రతి ఒక్కరూ హాజరై సంఘీభావం తెలిపండిఅని కోరారు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ కు సమ్మె నోటీసు అందజేసిన ఆశాకార్యకర్తలు

రాజన్న సిరిసిల్ల : ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటీయు ప్రకటించింది. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా సి ఐ టీ యు కార్యదర్శి కోడం రమణ ఆధ్వర్యంలో వేములవాడ, చందుర్తి, కోనరావుపేట పీహెచ్‌సీల పరిధిలోని ఆశా కార్యకర్తలు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసానికి వెళ్లి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో జయశీల, గాయత్రి, జమున, లత, మమత, లక్ష్మీ, అరుణ, జ్యోతి, రత్నమాల, హేమలత, ఉమ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

కులం "గొప్పలు" ప్రజలకు "తిప్పలు"

సామాజిక వర్గాలకు సకల సౌకర్యాలు.
దేశంలో వేగంగా మారిపోతున్న కుల సమీకరణాల ఆధిపత్యాలు .
కులాల పేరు చెప్పుకొని ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారు.
రాజకీయ పార్టీలన్నీ కులాలను పెంచి పోషిస్తున్నాయి.
ప్రజాసేవ మనగడ కులకంపులో నలిగిపోతుంది.
కులాధిపత్యం సమాజానికి ప్రమాదం.
కులం ముసుగులో రాజ్యాధికారాలు సాధిస్తున్నారు.
కులమే మనిషిని మతరూపికులను తయారుచేస్తుంది.
అగ్రకులాలన్నీ ఆధిపత్యం వైపే ఉన్నాయి.
పేదోడికి బతుకునివ్వలేని కుల దరిద్రం.
రిజర్వేషన్ల హక్కులను శాసిస్తున్న కులాధిపత్యం.
సామాన్యుల హక్కులపై రంకెలేస్తున్న రాజకీయం.
డాక్టర్ బరిగెల శివ.

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

దేశంలో కులాన్ని బట్టి ప్రాధాన్యత నిచ్చే విధానాల్లో సమూలమైన మార్పులు సంభవించాల్సిన అవసరం ఉందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. అధికారంలో ఉన్న పార్టీ అధికారంలో లేని పార్టీలు ఏవైనా కేవలం కులాన్ని బట్టి మాత్రమే రాజకీయ భవిష్యత్తును పెంపొందించుకుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ప్రధాన కులాలుగా చెప్పుకునే నేతలందరూ రాజకీయ వరుసలో ముందంజలో ఉండడం రాజకీయ ఆధిపత్యం కులంలో భాగమైపోయినది అన్నారు. కులాలను బట్టి పదవులు అనుగ్రహించబడ్డాక రాజకీయ పరమైన హక్కులు అన్ని కులాల వర్గాలకు సరిసమానంగా ఎలా వర్తించగలవంటూ సూటిగా నిలదీశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులంతా ప్రధాన కులాలకు చెందిన వారేనని గుర్తుచేశారు. పరోక్ష ఎన్నికల్లోను అవకాశాలు పొందుకునేది కూడా ప్రధాన కులాలేనంటూ గుర్తుచేశారు. కేవలం ఆధిపత్యాన్ని చలాయించుకోవడం కోసమే ఆధిపత్య కులాలు తమ రాజకీయ ప్రస్థానాలను పెంచుకుంటున్నారని ప్రత్యక్షంగా హెచ్చరించారు. కులాలను చూసి పదవులు ఇవ్వడం కులాలను చూసి అధికారాలు కట్టబెట్టడం కులాలను చూసి వ్యాపారాల్లో స్థానాలు కల్పించడం కులాలు చూసి ఉద్యోగ అవకాశాల్లో సర్దుబాటు చేయడం కులాలను చూసి ప్రతి విషయంలో ప్రాధాన్యతను ఇవ్వడం లాంటిది ఈ మధ్యకాలంలో ఎక్కడలేని విధంగా పెరిగిపోతున్నాయని మండిపడ్డారు. ఏ రాష్ట్రంలో చూసిన ప్రభుత్వ ఆధీనంలో గల నామినేటెడ్ పదవులు అన్ని ఆధిపత్య వర్గాలకే చెందుతున్నాయని అన్నారు. కులం మనిషి లోపల అహంకారాన్ని తయారు చేస్తుందని అట్టి అహంకారం సమాజాన్ని శాసించేలా చేస్తుందని తీవ్రంగా విమర్శించారు.

మానవత్వం మరుగున పడుతుంది..

కులాధిపత్యం ఒకవైపు రాజకీయాధిపత్యం ఒకవైపు వ్యాపార సంపాదన మరోవైపు విచ్చలవిడిగా పెరిగి పోతుండడంతో మనుషుల్లో కుల అహంకారం పెరిగిపోయి మానవత్వాన్ని మరుగున పడేసుకుంటున్నారని అన్నారు. అబద్దాలతో పూటగడపడం అలవాటు చేసుకున్న ప్రతి ఒక్కరు కుల ఆధిపత్యాన్ని పెంచి పోషిస్తున్నారని రాజకీయాల్లోనైనా వ్యాపారాల్లోనైనా అధికార పదవుల్లోనైనా కుల ప్రాధాన్యత విపరీతంగా పెరిగిపోతుందని వాటి వల్లనే మానవత్వానికి చోటు లేకుండా పోతుందని బాధపడ్డారు. మనుషుల ఆలోచన వాళ్ల వాళ్ల వ్యక్తిగత అధికార పదవులపై ఆధారపడుతూ వారు నిర్వహిస్తున్న పనుల్లో అలసత్వం గానీ కులవ్యత్యాసాలను పాటించకుండా సర్వ మానవాళికి సమాన ప్రాధాన్యత నిస్తూ అందరిని అభివృద్ధి పరచడం కోసం పని చేయాల్సింది పోయి అధిపతి వర్గాల కోసం అగ్రవర్ణాల అభివృద్ధి కోసం ప్రధాన కులాల ఎదుగుదలకు సహకరించడం కోసం చిన్న కులాలను పావులుగా వాడుకుంటున్నారని అన్నారు. కులాలకు ప్రాధాన్యతనిచ్చే ప్రతి ఒక్కరూ స్వార్థపరులేనంటూ పేర్కొన్నారు. అధికారం అడ్డం పెట్టుకొని నిజాయితీగా జీవించకపోవడం కూడా మనిషి తోని మానవత్వ లోపమేనంటూ చెప్పుకొచ్చారు. అధికార వర్గం అగ్రకులాల అధిపత్య ముసుగులో ఎన్ని తప్పిదాలు చేసిన మోసాలు చేసిన పొరపాట్లు చేసిన అన్ని దారుణాలు చేసిన ఎన్ని అవినీతి అక్రమాలకు పాల్పడిన వాళ్ల సామాజిక వర్గాలకు ఎలాంటి డోకా లేకుండా ఏమాత్రం చర్యలు తీసుకోబడకుండా సులభంగా తప్పించుకుంటున్నారని అన్నారు.

పెత్తనం పెరిగిపోతుంది..

ప్రజలను ప్రభుత్వ వ్యవస్థలను మోసం చేయాలనే ఆలోచన కలిగిన ప్రతి వ్యక్తి అధికార దురహంకారం కలిగిన వాళ్లేనంటూ హెచ్చరించారు. ప్రతి ప్రభుత్వ వ్యవస్థలో జరుగుతున్న అవినీతి అంతా అధికార పెత్తనం వల్ల సంభవిస్తున్నటువంటివేనని పేర్కొన్నారు. అధికార ఆదిపత్యానికి ఆదునుగా సామాన్య కులస్తులను రక్షణగా పెట్టుకుని అవినీతి దోపిడికి పాల్పడుతున్న అధికార వర్గం అంతా ఆదిపత్య కులానికి చెందిన వాళ్లేనని నిలదీశారు. నిజాయితీకి వ్యతిరేక మార్గంలో ప్రభుత్వ వ్యవస్థలను నడిపించే అధికారులంతా పక్కా అవినీతిపరులేనంటే హెచ్చరించారు. ఈ మధ్యకాలంలో కులాన్ని అడ్డం పెట్టుకొని అవినీతికి పాల్పడడం పతాక స్థాయికి చేరిపోయిందని దానిని గమనిస్తున్న అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ 48 గంటల పాటు జైల్లో ఉన్నట్లయితే వాళ్లను శాశ్వతంగా ఉద్యోగంలోకి కెళ్లి తొలగించాలని చట్టాన్ని ప్రవేశపెట్టడం ఎంతో గర్వకారణం అన్నారు. దాంతోపాటు అవినీతికి పాల్పడుతున్న అధికారులు అవినీతికి పాల్పడుతున్న రాజకీయ నాయకులు అవినీతిలో ఇరుక్కుపోయినట్లు రుజువులు లభించినచో శాశ్వతంగా ఉద్యోగంలోకెళ్లి, రాజకీయంలోకెళ్ళి తొలగించే చట్టాన్ని కూడా రూపొందించాలని కోరారు. ఏదేమైనా దేశంలో ప్రధాన రాష్ట్రాలన్నీ అగ్రవర్ణాల ముఖ్యమంత్రులతో నిండిపోవడం వల్ల కులాధిపత్యాలను పెంచి పోషిస్తూ రాజకీయ పీఠాలను సంపాదించుకుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ప్రతి రాష్ట్రంలో సామాజిక రాజకీ యం సామాజిక ప్రభుత్వ అధికారపాలన ప్రభుత్వ వ్యవస్థలలో అన్ని వర్గాల కులాలకు సమాన పదవులు లభించే విధంగా సమన్యాయాన్ని పాటించగలిగినప్పుడే ప్రధాన కులాల పెత్తనం తగ్గి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.




రూ.4 లక్షల రుణానికి.. రూ.9.23 లక్షలు చెల్లించాలా?

ఫైవ్ స్టార్ ఫైనాన్స్ తీరుపై సుధాకర్ ఆవేదన..
మారటోరియం పేరుతో మరో రూ.లక్ష డిమాండ్!

హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)

సామాన్య ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని ఫైనాన్స్ సంస్థలు అదనపు వడ్డీలు, ఛార్జీల పేరుతో భారాలు మోపుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీలో రుణం తీసుకున్న సుధాకర్ అనే వ్యక్తి తనకు ఎదురైన అనుభవాన్ని వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 13-11-2019న ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీలో రూ.4 లక్షల మార్టిగేజ్ లోన్ తీసుకున్నారు. 84 నెలల్లో మొత్తం రూ.8,23,788 చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకోగా, ఇప్పటివరకు 82 నెలల పాటు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించారు. అయితే కరోనా లాక్‌డౌన్ సమయంలో ఆర్‌బీఐ ప్రకటించిన మారటోరియం వెసులుబాటు





FIVE STAR
Business Finance Limited

Statement & Settlement of Account

Loan Account No	FSTSLALONS000005121063	Customer Name	THANDA SUDHAKAR
Loan Amount	4,00,000.00	Disbursal Date	13-11-2019
Interest Rate	24.54 (Annualized Rate of Interest)	Tenure (Months)	84
First Installment Date	15-11-2019	Last Installment Date	31-03-2027
EMI	9,807.00	Branch Name	Hyderabad
Address	4-3-21GRAMAKANTAM OLD VILLAGE NACHARA, Hyderabad, Andhra Pradesh-500076		

నేపథ్యంలో రెండు నెలల వాయిదాలు చెల్లించలేకపోయారు. ఇప్పుడు ఆ రెండు నెలలకు సంబంధించి మారటోరియం ఛార్జీల పేరుతో అదనంగా రూ.1 లక్ష చెల్లించాలని సంస్థ డిమాండ్ చేస్తోందని ఆరోపిస్తున్నారు. దీంతో ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన రూ.8,23,788కు అదనంగా మరో రూ.1,00,000 కలిపి మొత్తం రూ.9,23,788 అవుతోంది. అంటే రూ.4 లక్షల రుణంపై మొత్తం రూ.5,23,788 అదనపు భారం పడుతున్నట్లవుతోంది. ఈ విషయంపై ముషీరాబాద్ బ్రాంచ్ కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిసినా ఒక్క రూపాయి కూడా తగ్గించబోమని చెప్పినట్లు సుధాకర్ వాపోయారు. 82 నెలలు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించిన కస్టమర్‌కు రెండు నెలల మారటోరియం కారణంగా లక్ష రూపాయల అదనపు భారం విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఆ రూ.లక్షను ఏ నిబంధనల ప్రకారం లెక్కించారు? ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగానే వడ్డీ విధించారా? రుణ ఒప్పందంలో ఈ వివరాలు ఉన్నాయా? అనే అంశాలపై ఫైనాన్స్ సంస్థ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఫైవ్ స్టార్ ఫైనాన్స్ ఉన్నతాధికారులు స్పందించి పూర్తి లెక్కలు వెల్లడించడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఛార్జీలు విధించి ఉంటే వాటిని సరిదిద్ది న్యాయం చేయాలని సుధాకర్ కోరుతున్నారు. సామాన్య ప్రజలకు రుణాలు అందించడం ఎంత ముఖ్యమో,వారి ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని పారదర్శకంగా వ్యవహరించడం కూడా అంతే ముఖ్యం. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

(ప్రత్యేక కథనం త్వరలో)

శ్రీజ కుటుంబ సభ్యులకు కేటీఆర్ భరోసా

కనగల్, నవంబర్ 10(జై భీమ్ న్యూస్) :

నల్లగొండ జిల్లా కనగల్ మండలం శాబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన కోయ యాదగిరి రెడ్డి- రూప దంపతుల ఏకైక కుమార్తె శ్రీజ ఈ నెల 2 న అమెరికా బోస్టన్‌లో కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. శ్రీజ బోస్టన్ యూనివర్సిటీలో చదువుకుంటుంది. ఈ నెల 2వ తేదీన మిత్రులతో పుట్టినరోజు వేడుకకు వెళ్లి తను ఒక్కతే బయటికి వెళ్లింది. ఆ తర్వాత ఆమె మిత్రులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు ఆచూకీ కనుగొనలేకపోయారు. దాంతో తీవ్ర ఆందోళనలో కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులను నేడు నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి శాబ్దుల్లాపురం గ్రామంలో పరామర్శించారు. తమను ఏ నాయకుడు పట్టించుకోవట్లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడంతో అక్కడి నుండి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మాట్లాడి ఆ కుటుంబానికి సాయం చేయాల్సిందిగా అర్థించారు. కేటీఆర్ వెంటనే స్పందించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. భయపడకండి. ధైర్యంగా ఉండండి. ఏమీ కాదు. మీ అమ్మాయి తిరిగి వస్తుంది. వివరాలు ఇవ్వండి. అక్కడ తెలిసిన వారితో మాట్లాడుతానని వారికి కేటీఆర్ భరోసా కల్పించారు. కంచర్లతో తనకు వివరాలు వెంటనే పంపాల్సిందిగా సూచించారు. అదేవిధంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి కూడా ఫోన్‌లో శ్రీజ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం కంచర్ల మాట్లాడుతూ.. యాదగిరి రెడ్డి దంపతుల ఏకైక కుమార్తె ఆచూకీ లభ్యంగాక వారు పడుతున్న ఆవేదన తనకు బాధ కలిగించిందని, విషయం చెప్పగానే కేటీఆర్ స్పందించి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించి తన మిత్రుల ద్వారా వారికి సహకారం అందిస్తానని తెలియజేయడం ఆ కుటుంబానికి ఊరట కలిగించిందన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా విధులు నిర్వర్తించాలి

మొదటి పేజీ తరువాయి





అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు ట్రెయినీ డీఎస్పీలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కొత్తగా డీఎస్పీలుగా బాధ్యతలు చేపట్టబోతున్న అధికారులు తాము ఎక్కడి నుంచి వచ్చారో, ఏ లక్ష్యంతో పోలీసు శాఖలోకి ప్రవేశించారో ఎప్పటికీ మరిచిపోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఒక ప్రత్యేకమైన లక్ష్యంతో ఈ శాఖలోకి వచ్చారని, నిబద్ధతతో, బలమైన సంకల్పంతో పనిచేస్తే అసాధ్యమంటూ ఏదీ ఉండదని అన్నారు. ఇప్పటివరకు సాధించినది జీవితంలో మొదటి అధ్యాయం మాత్రమేనని, ఇకపై ప్రజలకు సేవ చేయడం, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడం రెండో అధ్యాయమని పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుగా పోలీసులను ఆశ్రయిస్తామని చెబుతుంటారని, సామాన్యుల నుంచి ఉన్నత స్థాయి వ్యక్తుల వరకు పోలీసు వ్యవస్థపై నమ్మకంతో ఉంటారని సీఎం తెలిపారు. గత ఏడు దశాబ్దాలుగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ శాంతిభద్రతలను కాపాడిన సీనియర్ పోలీసు అధికారుల కృషి వల్లే పోలీసు శాఖకు ప్రజల్లో ప్రత్యేక గౌరవం ఏర్పడిందని గుర్తుచేశారు. ఆ గౌరవాన్ని మరింత పెంచేలా కొత్త అధికారులు పనిచేయాలని కోరారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సమస్యను వేగంగా పరిష్కరించాలనే ఆలోచనతో పాటు, ముందుగా వారి సమస్య ఏమిటో పూర్తిగా అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. బాధితుల మాటలను ఓపికగా విని, వారి పరిస్థితిని అర్థం చేసుకుంటే సమస్యలో సగం పరిష్కారమైనట్లేనని అన్నారు. సమస్యల పరిష్కారానికి సమయం, వనరులు, సాంకేతిక పరిజ్ఞానం కీలకమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం కూడా మారుతోందని సీఎం వివరించారు. గతంలో దొంగసారాయి వంటి నేరాలు ఎక్కువగా ఉండేవని, ప్రస్తుతం కొకైన్, హెరాయిన్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా పోలీసులకు సవాలుగా మారిందన్నారు. డ్రగ్స్ వ్యవహారాల్లో ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్, ఆహార భద్రత, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు వంటి కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి స్పష్టమైన కార్యాచరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమని అన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ దూర ప్రాంతాల నుంచి కూడా మొబైల్ ఫోన్ల ద్వారా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి నేరాలను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. పోలీసు శాఖ అవసరాలకు అనుగుణంగా గతంలో సీఐడీ, ఏసీబీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసుకున్నామని సీఎం తెలిపారు. కొత్తగా ఎంపికైన డీఎస్పీలు తమ ఆసక్తి, నైపుణ్యాలకు అనుగుణంగా వివిధ పోలీసు విభాగాలను ఎంచుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రతిభావంతమైన సంస్థల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పోలీసు శాఖలో అవుట్‌సోర్సింగ్‌పై ఆధారపడకుండా సొంతంగా నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మారుతున్న నేరాల స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసు అధికారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. గతంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను మాత్రమే విదేశీ శిక్షణకు పంపించేవారని, తమ ప్రభుత్వం ఉపాధ్యాయులను సైతం శిక్షణ కోసం పంపించిందని గుర్తుచేశారు. అవసరమైతే పోలీసు అధికారులను ఒకటి, రెండు సంవత్సరాల పాటు ప్రత్యేక శిక్షణకు పంపించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గ్రూప్-1 నియామకాల గురించి ప్రస్తావిస్తూ, అత్యంత సంక్లిష్ట పరిస్థితుల్లోనూ నియామక ప్రక్రియను పూర్తి చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1 నియామకాలు చేపట్టిన తర్వాత 2025లో తిరిగి ఈ ప్రక్రియను నిర్వహించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా నియామకాల విషయంలో జాప్యం జరిగిందని, ఉన్నత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇది ఎంతో బాధాకరమైన పరిస్థితిగా మారిందని అన్నారు. గతంలో ప్రశ్నాపత్రాల లీకేజీతో నియామక ప్రక్రియలో గందరగోళం ఏర్పడిందని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతిందని సీఎం పేర్కొన్నారు. ఉన్నతస్థాయి నియామకాలు చేపట్టే కమిషన్‌లో అనుభవం, నైపుణ్యం, బాధ్యత కలిగిన వ్యక్తులు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, యూపీఎస్సీ చైర్‌పర్సన్‌తో పాటు నిపుణులతో సంప్రదింపులు జరిపి ఉన్నతస్థాయి నిపుణులను నియమించామని వివరించారు. నియామకాల ప్రక్రియలో పారదర్శకత, చిత్తశుద్ధి, బాధ్యత అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా ఒకేసారి 562 పోస్టులతో గ్రూప్-1 నియామకాలను పూర్తి చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నియామకాల ద్వారా 119 మంది డీఎస్పీలుగా ఎంపికయ్యారని వెల్లడించారు. నియామకాల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు. యువత తమ జీవితాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ వైస్ చైర్మన్, డైరెక్టర్ జనరల్ శాంతికుమారి, హోంశాఖ కార్యదర్శి శిఖా గోయల్, రాష్ట్ర భద్రతా సలహాదారు బి. శివధర్ రెడ్డి, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్ట్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ట్రెయినీ డీఎస్పీలను ముఖ్యమంత్రి అభినందించి, వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

మోడల్ కెరీర్ సెంటర్‌లో సెప్టెంబర్ 13న జాబ్ మేళా

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు
జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష

ఆంధ్రప్రదేశ్ రాజమహేంద్రవరం, నవంబర్ 10/(జై భీమ్ న్యూస్)

తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో నవంబర్ 13వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ యాక్ట్ ఫైబర్ నెట్, గణేష్ సెక్యూరిటీ సర్వీస్ మరియు కాలింగ్ బెల్ తదితర సంస్థల్లో పలు ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు



నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు.

అభ్యర్థుల అర్హతలు:

వయస్సు: 19 నుంచి 38 సంవత్సరాల లోపు. విద్యార్హత: పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ. అనుభవం: సంబంధిత రంగంలో అనుభవం ఉన్నవారు లేదా ఉద్యోగం పట్ల ఆసక్తి ఉన్నవారు. ఉద్యోగం: వివిధ సంస్థల్లో అందుబాటులో ఉన్న పోస్టులకు ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు వఎజూశ్రీశీఎఎవత్.ఖజూ.స్ర్తశీజ.అఅ వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో ముందుగా రిజిస్టర్ చేసుకుని, రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు నేరుగా హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9398318601 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష కోరారు.

రాష్ట్రస్థాయి పోలీస్ క్రికెట్ పోటీల్లో..

వరంగల్ జట్టు సత్తా చాటాలి

క్రీడాస్ఫూర్తితో ఆడి విజయం సాధించాలి.. జట్టు సభ్యులకు సీపీ ఎన్. శ్వేత ఐపీఎస్ శుభాకాంక్షలు

వరంగల్, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)

రాష్ట్రస్థాయి పోలీస్ క్రికెట్ పోటీల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ జట్టు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆకాంక్షించారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 5వ రాష్ట్రస్థాయి పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్--2026లో భాగంగా క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ తరపున క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టుకు గీసుగొండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ నాయకత్వం



వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు ప్రాతినిధ్యం వహించనున్న జట్టు సభ్యులను పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పోలీస్ విధుల్లో నిరంతరం నిమగ్నమయ్యే సిబ్బందికి క్రీడలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టు సభ్యులంతా సమష్టిగా కృషి చేస్తూ, క్రీడాస్ఫూర్తితో ఆడి తమ ప్రతిభను చాటాలని సూచించారు. ప్రతి మ్యాచ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు మంచి పేరు, గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపికైన జట్టు సభ్యులందరికీ సీపీ ఎన్. శ్వేత హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

కాకతీయ విశ్వవిద్యాలయం

కే. స్రవంతికి డాక్టరేట్ ప్రకటించారు



వరంగల్, నవంబర్ 10 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పరిశోధకురాలు కే. స్రవంతికి విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్‌ను ప్రకటించారు. డాక్టర్ కే. స్రవంతి "ఏ మల్టీ - క్రిటీరియా యూసర్ ప్రిఫెరెన్సు - బేస్డ్ రికామెండర్ సిస్టం ఫర్ ప్రిడిక్షన్ అండ్ జనరేషన్ అఫ్ రికామెండేషన్స్ యూసింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్యూ " అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్‌ను పొందారు. ఈ పరిశోధనను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగ సహ ఆచార్యురాలు డాక్టర్ టి. అర్చన పర్యవేక్షణలో పూర్తి చేశారు. ప్రస్తుతం డాక్టర్ కే. స్రవంతి కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో సహ ఆచార్యురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ కే. స్రవంతిని అభినందించి, ఆమె ను ప్రశంసించారు.

కాకతీయ విశ్వవిద్యాలయం, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన పరిశోధకుడు రమేష్ చిందంకు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది



వరంగల్ నవంబర్ 10 (జై భీమ్ న్యూస్)

ఈ మేరకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్‌ను ప్రకటించారు. డాక్టర్ రమేష్ చిందం "డైనమిక్స్ అఫ్ బిహేవియరాల్ ఫైనాన్స్ ఆన్ స్టాక్ ఇన్వెస్ట్మెంట్ డెసిషన్స్ -- ఏ స్టడీ " అనే అంశంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ పరిశోధనను కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన ఆచార్య రాజేందర్ కట్ల పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తి చేశారు. ములుగు జిల్లా, ములుగు మండలం, బరిగాలనిపల్లి గ్రామానికి చెందిన రమేష్ చిందంకు డాక్టరేట్ లభించడం పట్ల పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

న్యాయ సహాయం అందించడంలో పారా లీగల్ వాలంటీర్ల పాత్ర కీలకం

ప్రజలకు న్యాయ సేవాధికార సంస్థకు మధ్య విశ్వసనీయమైన వారధిగా నిలవాలి
జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనేద్ అహ్మద్ మౌలానా



ఆంధ్రప్రదేశ్ రాజమహేంద్రవరం, నవంబర్ 10/2026(జై భీమ్ న్యూస్)

సమాజంలో చట్టాలు, హక్కులపై సరైన అవగాహన లేక నిస్సహాయ స్థితిలో ఉన్న వివిధ వర్గాల ప్రజలకు న్యాయ సహాయాన్ని చేరవేయడంలో పారా లీగల్ వాలంటీర్ల పాత్ర అత్యంత కీలకమైనదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనేద్ అహ్మద్ మౌలానా పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం లోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పారా లీగల్ వాలంటీర్లకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, న్యాయ సేవాధికార సంస్థకు మధ్య పారా లీగల్ వాలంటీర్లు విశ్వసనీయమైన వారధిగా నిలవాలని సూచించారు. క్రమశిక్షణ, నీతి, నిజాయితీ, నిస్వార్థ సేవాభావంతో తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వై. శ్రీలక్ష్మి మాట్లాడుతూ పారా లీగల్ వాలంటీర్లు తమ విధులను అత్యంత బాధ్యతాయుతంగా, నిజాయితీతో నిర్వర్తించాలని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా వాలంటీర్లకు కల్పించిన గుర్తింపు, అధికారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం లేదా అనధికారిక కార్యకలాపాల కోసం దుర్వినియోగం చేయకూడదని స్పష్టం చేశారు. సంస్థ నిర్దేశించిన నిబంధనలు, విధివిధానాలకు లోబడి మాత్రమే బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. సీనియర్ న్యాయవాది డాక్టర్ పి. త్రినాథరావు మాట్లాడుతూ సమాజంలోని అనేక మంది ప్రజలకు ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశాలు, ప్రాథమిక హక్కులపై సరైన అవగాహన లేదన్నారు. అటువంటి వారికి పారా లీగల్ వాలంటీర్లు అండగా నిలుస్తూ, వారి సమస్యలను గుర్తించి, తగిన న్యాయ సహాయం అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది డాక్టర్ పి. త్రినాథరావు తెలుగులో రచించిన "అటవీ హక్కుల గుర్తింపు చట్టం--2006: తరచూ అడిగే ప్రశ్నలు -- వివరణ" అనే పుస్తకాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనేద్ అహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, విధివిధానాలు, వారి అధికార పరిధి, ప్రజలకు న్యాయ సహాయం అందించే విధానం తదితర అంశాలపై సీనియర్ న్యాయవాది డాక్టర్ పి. త్రినాథరావు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

(కారా) చట్టం ద్వారా దత్తత తీసుకోవ్వలి- డాక్టర్ అనితా రెడ్డి

అక్రమ దత్తత చెల్లదు, చట్టపరమైన చర్యలు తప్పవు





హన్మకొండ నవంబర్ 10/2026(జై భీమ్ న్యూస్)

అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, ఫార్మర్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి హన్మకొండ లోని శిశుగృహను సందర్శించారు పిల్లల కేర్ అండ్ ప్రొటెక్షన్ అడిగి తెలుసుకున్నారు పిల్లలతో అమ్మలా సమయం గడిపి పిల్లలకు కబుర్లు చెప్పి ఆడించారు, పిల్లలకు, సిబ్బందికి స్వీట్స్ అందించారు, ఏ అవసరం ఉన్న తను సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు, సిబ్బంది కి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు, డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలమేరకు చట్ట బద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి చేయాలని, చట్ట బద్ధతలేని దత్తత చెల్లదని, ప్రభుత్వం (కారా) చట్టం ప్రకారం పిల్లల దత్తత తీసుకోవాలని, అక్రమ దారులలో దత్తత తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని అన్నారు, పిల్లలు వద్దను కున్నవారు ప్రభుత్వానికి పిల్లలను సరెండర్ చేయవచ్చని అంతేకానీ పిల్లలను చెత్తకుండీలలో, ముళ్ళపొదలలో విసిరేయవద్దని విజ్ఞప్తి చేసారు, పిల్లల లేక ఎందరో బాధపడు తున్నారని అన్నారు, శిశుగృహ లో ఉన్న పిల్లల దత్తత ప్రక్రియ సంబంధిత అధికారులు త్వరగా పూర్తిచేయాలని, అప్పుడు వారికి కుటుంబాన్ని అందించి కొత్త జీవితాన్ని బహుమతిగా అందించినవారమవుతామని అన్నారు, అక్రమదత్తతలు ఆగాలంటే , దత్తత చట్టం పై గ్రామీణ స్థాయి నుండి నగర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు, శిరీష సిబ్బంది పాల్గొన్నారు. – డాక్టర్ అనితా రెడ్డి, అనురాగ్ సొసైటీ చైర్మన్, ఫార్మర్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్.

మహిళల నుంచి అక్రమంగా అండాల సేకరణ ఆరోపణలు

5 ఫెర్టిలిటీ సెంటర్లకు మహిళా కమిషన్ నోటీసులు



హైదరాబాద్ నవంబర్ 10 /2026(జై భీమ్ న్యూస్)

హైదరాబాద్ లో మహిళల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అండాలను సేకరిస్తున్నారనే ఆరోపణలపై తెలంగాణ మహిళా కమిషన్ స్పందించింది. హైదరాబాద్‌లోని ఐదు ఫెర్టిలిటీ కేంద్రాలకు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టింది. మహిళల అనుమతి లేకుండా అండాల సేకరణ జరుగుతోందా? వైద్యపరమైన భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై కమిషన్ ఆరా తీస్తోంది. నోటీసులు అందుకున్న కేంద్రాల్లో ఇందిరా ఐ వి ఎఫ్ , నర్మదా ఫెర్టిలిటీ సెంటర్, ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్, సద్గురు ఫెర్టిలిటీ సెంటర్,పద్మజ ఫెర్టిలిటీ సెంటర్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం బుద్ధ భవన్‌లోని మహిళా కమిషన్ కార్యాలయంలో ఆయా కేంద్రాల మేనేజింగ్ డైరెక్టర్లు, మెడికల్ సూపరింటెండెంట్లు, కేంద్రాల ప్రతినిధులు విచారణకు హాజరయ్యారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద సమక్షంలో ఈ వ్యవహారంపై వివరణ కోరినట్లు సమాచారం. అండాల దాతల నుంచి రాతపూర్వక సమ్మతి తీసుకున్నారా? అండాల సేకరణకు సంబంధించి చట్టం నిర్దేశించిన పరిమితులను పాటించారా? మహిళలకు అవసరమైన వైద్య పరీక్షలు, భద్రతా చర్యలు కల్పించారా? అనే అంశాలపై కమిషన్ ప్రధానంగా దృష్టి సారించింది. అలాగే అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఆర్ట్) చట్టం–2021 నిబంధనలు ఉల్లంఘించారా? మహిళల ఆరోగ్యం, గౌరవం, పునరుత్పత్తి హక్కులకు భంగం కలిగిందా? అనే అంశాలపై ఆధారాలను పరిశీలించనుంది. ఈ వ్యవహారంలో సంబంధిత ఫెర్టిలిటీ కేంద్రాలు లిఖితపూర్వక వివరణలు, అవసరమైన రికార్డులు సమర్పించాల్సి ఉంది. విచారణలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ నిర్ణయించే అవకాశం ఉంది. మహిళల ఆరోగ్యం, హక్కుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమనే సంకేతాలను ఈ విచారణ ద్వారా మహిళా కమిషన్ ఇచ్చింది. అయితే, ఆరోపణలు ఇంకా విచారణలోనే ఉన్నాయి. సంబంధిత కేంద్రాలపై నేరం నిర్ధారణ కాలేదు.

INDIRA IVF FERTILITY & IVF CENTRE
NARMADA Fertility Center
oasis FERTILITY
Dr.PADMAJA FERTILITY CENTER
SADGURU FERTILITY CENTRE

వరంగల్‌లో హోటల్ గ్రీన్ పార్క్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు





రూ.23,468 విలువైన కల్తీ, అపరిశుభ్ర ఆహార పదార్థాలు స్వాధీనం.. ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి తనిఖీలు

వరంగల్, నవంబర్ 10(జై భీమ్ క్రైమ్ న్యూస్)

నగరంలోని మండి బజార్ రోడ్డులో ఉన్న హోటల్ గ్రీన్ పార్క్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులు మంగళవారం (10-11-2026) సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో ఆహార భద్రత, పరిశుభ్రత నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా హోటల్‌లో పలు రకాల ఆహార పదార్థాలు, వాటి తయారీలో ఉపయోగించే పదార్థాలను అధికారులు గుర్తించారు. వీటిలో 100 గ్రాముల చొప్పున 16 ప్యాకెట్ల సింథటిక్ ఫుడ్ కలర్ (బ్లష్), మొత్తం 48 ప్యాకెట్ల టేస్టింగ్ సాల్ట్ (మోనోసోడియం గ్లుటామేట్), 20 కిలోల ఫ్రోజెన్ చికెన్, 10 కిలోల చికెన్ కబాబ్స్, 5 కిలోల పనీర్, ఒక కిలో అల్లం పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.23,468గా అధికారులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ఆహార పదార్థాలను తదుపరి పరీక్షలు, అవసరమైన చట్టపరమైన చర్యల నిమిత్తం ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులకు అప్పగించారు. సంబంధిత ఆహార వ్యాపార నిర్వాహకుడిపై ఆహార భద్రత, ప్రమాణాల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. హోటల్ యజమాని మహమ్మద్ అబ్దుల్ వాసిఫ్ (38), ఖలీఖ్ కుమారుడు, నక్కలగుట్ట, హనుమకొండ నివాసిగా గుర్తించారు. మండి బజార్ రోడ్డులోని హోటల్ గ్రీన్ పార్క్‌ను ఆయన నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో ఏసీపీ టాస్క్‌ఫోర్స్ ఎ. మధుసూధన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు బందారి రాజు, జి. సుబ్బారెడ్డి, కె. శ్రీధర్, బి. రాజగోపాల్ తదితర టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే విధంగా ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



మొరసు తుపాను ప్రభావంతో దెబ్బతిన్న కరిచర్లగూడెం-సంజీవపురం రహదారి





పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు 320 మీటర్ల మేర పూర్తిగా ధ్వంసమైన రహదారి మరో 700 మీటర్ల మేర విరిగి ఒకవైపునకు ఒరిగి కుంగిపోయిన రహదారి ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో మరమ్మతు పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లా/ నవంబర్/10 /2026(జై భీమ్ న్యూస్)

మొరసు తుపాను ప్రభావంతో తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండల పరిధిలోని కరిచర్లగూడెం నుంచి సంజీవపురం వెళ్లే రహదారి తీవ్రంగా దెబ్బతిందని, ప్రజలకు రాకపోకల పరంగా ఇబ్బందులు కలగకుండా రహదారి పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కరిచర్లగూడెం – సంజీవపురం రహదారిని క్షేత్రస్థాయిలో సందర్శించి, మొరసు తుపాను ప్రభావంతో జరిగిన నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. భారీ వర్షాలు, వరద ప్రవాహం కారణంగా సుమారు 320 మీటర్ల మేర రహదారి పూర్తిగా ధ్వంసమైందని, సుమారు 700 మీటర్ల మేర రహదారి విరిగి ఒకవైపునకు ఒరిగిపోవడంతో పాటు కుంగిపోయిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రహదారి దెబ్బతిన్న తీరును, వరద ప్రవాహం కారణంగా ఏర్పడిన పరిస్థితులను కలెక్టర్ పరిశీలించి, చేపట్టాల్సిన పునరుద్ధరణ చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. దెబ్బతిన్న రహదారిపై ప్రజలు, వాహనదారులు ప్రయాణించే సమయంలో ప్రమాదాలు జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రహదారిపై తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు. రహదారి పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో గండి పడిన ప్రాంతంలో వరద నీటి ప్రవాహానికి అనుగుణంగా పైప్‌లైన్లు ఏర్పాటు చేసి, నీటి ప్రవాహాన్ని సక్రమంగా మళ్లించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో దెబ్బతిన్న రహదారి ప్రాంతాల్లో అవసరమైన మరమ్మతు, పునర్నిర్మాణ పనులను చేపట్టాలని ఆదేశించారు. రెండు శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ బాలకృష్ణతో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పరిస్థితులపై మాట్లాడి, రహదారికి జరిగిన నష్టం, చేపట్టిన తాత్కాలిక మరమ్మతు పనులు, పూర్తిస్థాయి పునరుద్ధరణకు అవసరమైన చర్యల గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు రాకపోకల విషయంలో ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గత మూడు రోజులుగా గోపాలపురం మండలంలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించడం జరిగిందని తెలిపారు. అస్నా, మిచౌంగ్ తుపానుల ప్రభావంతో కేవలం ఐదు గంటల వ్యవధిలోనే దాదాపు 60 మిల్లీమీటర్ల మేర కురిసిన కుండపోత వర్షానికి తోడు, ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో పలు చెరువులకు గండ్లు పడి విస్తారంగా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. బలమైన ఈదురు గాలులు, వర్షాల వల్ల ముఖ్యంగా వరి, అరటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పంట నష్టం లెక్కింపు (క్రాప్ ఎన్యూమరేషన్) ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని వెల్లడించారు. జిల్లాలో జరిగిన తీవ్ర నష్టాన్ని స్వయంగా పరిశీలించేందుకు కేంద్ర అంతర్-మంత్రిత్వ బృందాన్ని పంపాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని, త్వరలోనే ఆ కేంద్ర బృందం ఇక్కడి ముంపు ప్రాంతాలను సందర్శించి బాధితులకు తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వివరించారు. తుపాను ప్రభావంతో దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను త్వరితగతిన పునరుద్ధరించి, ప్రజలకు సాధారణ రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు.

సార్వత్రిక ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ అంశాలపై సమ్మిట్‌లో చర్చలు

భారత్ సమ్మిట్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, నవంబర్ 10(జై భీమ్ న్యూస్) :

హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారత్ సమ్మిట్ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 దేశాల నుంచి ప్రతినిధులు భారత్ సమ్మిట్‌కు హాజరుకానున్నారని టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సార్వత్రిక ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ అంశాలపై సమ్మిట్‌లో చర్చలు జరగనున్నాయి. సార్వత్రిక ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ అంశాలపై సమ్మిట్‌లో చర్చలు జరగనున్నాయి. గత ఏడాది నిర్వహించిన భారత్ సమ్మిట్‌కు సుమారు 100 మంది ప్రతినిధులు హాజరయ్యారు. గత ఏడాది సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారని అన్నారు. ఈ ఏడాది భారత్ సమ్మిట్‌కు కూడా రాహుల్ గాంధీ హాజరుకానున్నారు. ఢిల్లీ నుంచి పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు కూడా సమ్మిట్‌కు హాజరు అవుతారు. ? అంతర్జాతీయ ప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొనే ఈ సమ్మిట్ విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేసేస్తున్నానని అన్నారు.

టీజీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలి

12, 13 తేదీల్లో డీఈఓ / గెజిటెడ్ హెడ్‌మాస్టర్ గ్రేడ్-1 పరీక్షలు
హనుమకొండ జిల్లాలో 3,650 మంది అభ్యర్థులు..
ఐదు పరీక్షా కేంద్రాల ఏర్పాటు
అధికారులకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశాలు

హన్మకొండ, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈఓ) / గెజిటెడ్ హెడ్‌మాస్టర్ గ్రేడ్--1 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు, ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల ప్రతినిధులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, ఆర్టీసీ శాఖల అధికారులతో పాటు పరీక్షా కేంద్రాల ప్రతినిధులతో పరీక్షల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఈ నెల 12, 13 తేదీల్లో డీఈఓ / గెజిటెడ్ హెడ్‌మాస్టర్ గ్రేడ్-1 పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఈ పరీక్షలకు జిల్లాలో 12వ తేదీన 1,825 మంది, 13వ తేదీన మరో 1,825 మంది చొప్పున మొత్తం 3,650 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. హనుమకొండ వడ్డేపల్లిలోని అయాన్ డిజిటల్ జోన్, ములుగు క్రాస్ రోడ్‌లో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, రామారం (భీమారం) పొద్దుటూరి గార్డెన్స్ సమీపంలోని మోక్షిత్ కంప్యూటర్స్, గోపాల్‌పూర్ కల్లుమండవ సమీపంలోని ఎన్ఎస్ గ్లోబల్ టెక్నాలజీస్, హసన్‌పర్తి చింతగట్టు హైవే సమీపంలోని నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 3,650 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఇతర అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే పరీక్షల నిర్వహణలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, పోలీస్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఆయా పరీక్షా కేంద్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం..

ఆధ్యాత్మిక శోభతో దేవాలయ ప్రాంగణం
కార్తీక మాసం తొలిరోజు దీపోత్సవం..
ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు



వరంగల్, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)

కార్తీక మాసం మొదటి రోజును పురస్కరించుకుని దేవాలయ ప్రాంగణంలో భక్తిభావంతో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణాన్ని దీపాలతో అలంకరించడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దీపోత్సవంలో భక్తిశ్రద్ధలతో భాగస్వాములయ్యారు. అనంతరం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్తీక మాసం పవిత్రతను చాటుతూ నిర్వహించిన ఈ వేడుకలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించాయి. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, సేవా సమితి సభ్యులతో పాటు దేవాలయ ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, పేరాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. భక్తులు, సేవా సమితి సభ్యుల సహకారంతో కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు.




యూఏఈలో ఉద్యోగ అవకాశాలు..

హనుమకొండ జిల్లా నిరుద్యోగులకు సువర్ణావకాశం
టామ్‌కామ్ ద్వారా నిర్మాణ రంగంలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
నెలకు రూ.27 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనం.. ఉచిత విమాన టికెట్, వసతి, భోజనం, రవాణా సౌకర్యం
జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ. శ్యామల

హనుమకొండ, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లా నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థ (టామ్‌కామ్) ప్రత్యేక చర్యలు చేపట్టింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని నిర్మాణ రంగంలో వివిధ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ. శ్యామల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకాల ద్వారా సాధారణ సహాయకులు, వెల్డింగ్ కార్మికులు, స్టీల్ ఫిక్సర్లు, మేస్త్రీల పోస్టులను భర్తీ చేయనున్నారు. సాధారణ సహాయకుల ఉద్యోగాలకు నెలకు 1,050 యూఏఈ దిర్హాములు (సుమారు రూ.27,080), వెల్డింగ్ కార్మికులు, స్టీల్ ఫిక్సర్లు, మేస్త్రీలకు నెలకు 1,350 దిర్హాములు (సుమారు రూ.34,830) వేతనం చెల్లించనున్నారు. అభ్యర్థుల వయస్సు 22 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలని, సాధారణ సహాయకుల ఉద్యోగాలకు కనీసం రెండేళ్ల పని అనుభవం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఇతర ఉద్యోగాలకు సంబంధిత రంగాల్లో నైపుణ్యం, పని అనుభవం కలిగి ఉండాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత విమాన ప్రయాణ టికెట్, ఉచిత వసతి, రోజుకు మూడు పూటల ఉచిత భోజనం, ఉచిత రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన స్వీయ వివరాల పత్రాన్ని సంబంధిత ఫోన్ నంబర్‌కు పంపించడం ద్వారా లేదా ప్రకటనలో పొందుపరిచిన చతురస్ర సంకేతాన్ని (క్యూఆర్ కోడ్) స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలు, దరఖాస్తు విధానం కోసం హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ఎఫ్-24, ఐ.డి.ఓ.సి. కలెక్టరేట్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు 08035524946 సహాయ నంబర్‌కు లేదా 040-23342040 కార్యాలయ ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని, అలాగే ఇఅ.ష్ట్రుఅబ-ఎఖఎశీఅఃఏస్త్రఖఅశ్రీ.ఎశీఏ అనే ఈ-మెయిల్ చిరునామా ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. టామ్‌కామ్ అధికారిక అంతర్జాల చిరునామా ఎఇఎష్.శీఎఇశీవ్.వశ్రీఖఅష్ట్రుఅఖ.స్త్రశీజ.అఅ ద్వారా కూడా పూర్తి సమాచారం పొందవచ్చని వెల్లడించారు. విదేశాల్లో ఉద్యోగాలు పొందాలనే ఆసక్తి ఉన్న జిల్లా నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ. శ్యామల కోరారు.



పత్రికా ప్రకటన
యూఏఈలో ఉద్యోగ అవకాశాలు Dated 10.11.2026

• టామ్‌కామ్ ద్వారా దరఖాస్తుల ఆహ్వానం
• జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీమతి ఏ .. శ్యామల

హనుమకొండ జిల్లా తెలంగాణ ప్రభుత్వం పరిధిలోని తెలంగాణ ఓవర్సీస్ మానవవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM) ఆధ్వర్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE)లోని నిర్మాణ రంగంలో ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. తెలంగాణలోని అన్ని జిల్లాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని మెర్చల్-మల్కాజిగిరి జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం. రాధిక సూచించారు.

ఉద్యోగ వివరాలు మరియు వేతనం:
1. జనరల్ హెల్పర్స్ – నెలకు AED 1,050 (సుమారు ₹27,080). (సహాయకులకు ఎలాంటి నైపుణ్య పరీక్ష ఉండదు.)
2. వెల్డింగ్ చేయడంలు – నెలకు AED 1,350 (సుమారు ₹34,830).
స్టీల్ ఫిక్సర్లు – నెలకు AED 1,350 (సుమారు ₹34,830).
3. మేస్త్రీలు – నెలకు AED 1,350 (సుమారు ₹34,830).
గమనిక: వర్తించే నిబంధనల ప్రకారం బోనస్ ఇవ్వబడుతుంది.

అర్హతలు:
వయోపరిమితి : 22 నుంచి 42 సంవత్సరాలు. ఒప్పంద కాలపరిమితి: 2 సంవత్సరాలు.

కంపెనీ అందించే సౌకర్యాలు:
ఉచిత విమాన టికెట్, ఉచిత వసతి, ఉచిత భోజనం (రోజుకు 3 పూటలు), ఉచిత రవాణా సౌకర్యం.

నమోదు చేసుకునే విధానం:
ఆసక్తి ఉన్న అభ్యర్థులు క్రింది ఫోన్ నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా గాని, లేదా వెబ్‌సైట్‌లోని QR కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా గాని తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. మరింత సమాచారం కొరకు సంప్రదించండి:
జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, F24, I.D.O.C కలెక్టరేట్, హనుమకొండ జిల్లా
ఈమెయిల్: de.hanumakonda@gmail.com

హెల్ప్‌లైన్ / మిస్డ్ కాల్ నంబర్ 08035524946
కార్యాలయ ఫోన్ నంబర్: 040-23342040
వెబ్‌సైట్: www.tomcom.telangana.gov.in

District Employment Officer
District Employment Exchange
హనుమకొండ జిల్లా

దివ్యాంగ ఉప సందాలకులు, జిల్లా పౌర సంబంధిత అధికారికి కార్యాలయం హనుమకొండ జిల్లా గారికి సమర్పిస్తూ అను దిన పేపర్ లో ప్రకటించుటకు కోరినది.

కిసాన్ మేళా నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

శాఖల సమన్వయంతో రైతులకు ప్రభుత్వ పథకాలు, ఆధునిక వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించాలి
జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)

రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు విధానాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమగ్ర అవగాహన కల్పించేలా కిసాన్ మేళా నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న కిసాన్ మేళా ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళా నిర్వహణకు సంబంధించిన ముందస్తు ప్రణాళిక, శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, రైతులకు అందించాల్సిన సమాచారంపై అధికారులతో చర్చించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని రైతులకు పంటల సాగుపై ముందస్తు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకోసం వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్యశాఖ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, బ్యాంకింగ్ తదితర శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాల మట్టాలు తగ్గే అవకాశాలను పరిగణనలోకి తీసుకొని అధిక నీటి అవసరం లేని ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవడం, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు సాధించే పద్ధతులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా బ్యాంకుల ద్వారా రైతులకు అందించే పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు, సోలార్ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని తెలిపారు. ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు విధానాలు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ రంగంలో అందుబాటులో ఉన్న సాంకేతిక సలహాలను రైతులకు ఒకే వేదికపై అందించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవడం, ప్రత్యామ్నాయ పంటల సాగుతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవడం వంటి అంశాలపై కిసాన్ మేళా ద్వారా రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతులకు ఉపయోగపడే విధంగా ప్రతి శాఖ తన పరిధిలోని సమాచారాన్ని సమగ్రంగా సిద్ధం చేసుకొని మేళాలో పాల్గొనాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, ఆత్మ పీడీ విజయ నిర్మల, డీసీవో నీరజ, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆనందం, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, పశుసంవర్ధక శాఖ అధికారి బాలాజీ, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, డీఆర్డీవో నాగ పద్మజ, సీపీవో చంద్రకళతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్తీక మాసం సందర్భంగా పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సులు


పంచారామాలు, రామప్ప, కాళేశ్వరం, భద్రాచలం, అరుణాచలం, శబరిమలకు ప్రత్యేక రవాణా సౌకర్యం
హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్


హన్మకొండ, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం వివిధ పుణ్యక్షేత్రాలు, ప్రముఖ దేవాలయాల దర్శనానికి హనుమకొండ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. కార్తీక మాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో శైవ క్షేత్రాలను దర్శించుకునేందుకు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో వారి ప్రయాణ సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, లక్నవరం సరస్సు, మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థానం, మల్లూరు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, బొగత జలపాతం, కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి కూడా ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీ, సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ కోట సందర్శనకు వెళ్లే పర్యాటకుల కోసం కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పంచారామ క్షేత్రాలైన అమరావతి, ద్రాక్షారామం, భీమవరం, పాలకొల్లు, సామర్లకోటలోని స్వామివార్ల దర్శనానికి భక్తులు వెళ్లేందుకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి కూడా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. అయ్యప్ప స్వామి భక్తుల సౌకర్యార్థం కేరళలోని శబరిమలై దేవస్థానానికి భక్తుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. కార్తీక మాసంలో భక్తులు, యాత్రికులు ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక బస్సుల వివరాలు, ప్రయాణ ఏర్పాట్లు, ఇతర సమాచారం కోసం 8977781103, 9493882464, 9949193893 నంబర్లను సంప్రదించాలని హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ కోరారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE | సమస్యలపై సమరంగా | Jai Bheem | సామాన్యుడి ఆయుధంగా

భూ రీ సర్వేను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలి





అధికారులకు అదనపు కలెక్టర్ ఎన్. రవి ఆదేశాలు
రత్నగిరిలో భూ రీ సర్వే పరిశీలన.. వంగర గురుకుల బాలికల పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలో తనిఖీలు

భీమదేవరపల్లి, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)

భూముల రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న తీరును సర్వేయర్లను, స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ రీ సర్వే ప్రక్రియలో స్థానిక రైతుల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి సందేహాలు, ఇబ్బందులు తలెత్తకుండా సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణలో జాగ్రత్తలు పాటిస్తూ నిర్ణీత సమయంలో రీ సర్వేను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం వంగర గ్రామంలోని డాక్టర్ పి.వి. రంగారావు తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. వంటగదిలో నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులను తనిఖీ చేసి, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని పాఠశాల నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ అక్కడి విద్యా సదుపాయాలు, మౌలిక వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో భూముల కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, తహసీల్దార్ రాజేష్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దీపావళి వేళ నేతకాని కులస్తుల ప్రత్యేక బతుకమ్మ సంబరాలు

సీతంపేటలో సంప్రదాయబద్ధంగా వేడుకలు.. పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





హన్మకొండ, నవంబర్ 10(జై భీమ్ న్యూస్) :

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని నేతకాని కులస్తులు ప్రత్యేక బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తరతరాలుగా వస్తున్న తమ ప్రత్యేక ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ దీపావళి పండుగ సందర్భంగా ప్రత్యేకంగా బతుకమ్మను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సంప్రదాయ పాటలు, ఆటపాటలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి హాజరై బతుకమ్మ వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని నేతకాని కులస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ప్రత్యేకంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దీపావళి పర్వదినాన ప్రత్యేకంగా బతుకమ్మను పేర్చి పూజలు నిర్వహించడం, సంప్రదాయ పాటలు, ఆటలతో సంబరాలు జరుపుకోవడం మన సాంస్కృతిక వైభవానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి కులానికి, ప్రతి సమాజానికి ప్రత్యేకమైన ఆచారాలు, సంప్రదాయాలు ఉంటాయని, వాటిని గౌరవిస్తూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పూర్వీకులు అందించిన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకోవడం ద్వారా మన మూలాలను, ప్రత్యేక గుర్తింపును నిలబెట్టుకోగలమని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా నేతకాని కులస్తులు నిర్వహించిన ఈ ప్రత్యేక బతుకమ్మ వేడుకలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్, మండల మాజీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్, 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, సీనియర్ నాయకులు, మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, నేతకాని కులస్తులు, గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేయూలో ఏఐజీ హాస్పిటల్ మెగా ప్రత్యేక ఉద్యోగ మేళా పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 12న హైదరాబాద్ ఏఐజీ హాస్పిటల్‌లో ఉద్యోగాల కోసం ప్రత్యేక ప్లేస్‌మెంట్ డ్రైవ్
డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు





వరంగల్, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయం ప్లేస్ మెంట్ సెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉద్యోగ నియామకాల కోసం ఈ నెల 12వ తేదీన మెగా ప్రత్యేక ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పాలన, మానవ వనరుల విభాగంలో ఉద్యోగ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నెల 12వ తేదీన ఉదయం 11 గంటలకు విశ్వవిద్యాలయంలోని హ్యుమానిటీస్ భవనంలోని సెమినార్ హాలులో ఈ ప్రత్యేక ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్లేస్‌మెంట్ సెల్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఏఐజీ హాస్పిటల్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించే ఈ ప్రత్యేక నియామక కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ చిర్ర రాజు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది నియామకాల కోసం ప్రత్యేకంగా ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉద్యోగాలు సాధించే దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ చీకటి శ్రీను, డాక్టర్ బుర్రి ఉమాశంకర్, ల్యాదేళ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

దక్షిణాది రాష్ట్రాలకు వర్ష సూచన

నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఎఓఆ) అంచనా వేసింది.ఏర్పడిన తర్వాత 24 గంటల్లో మరింత స్పష్టమైన అల్పపీడనంగా మారి వాయవ్య దిశగా కదిలే అవకాశం వుంది. నవంబర్ 14 నుంచి 16 వరకు కోస్తాంధ్ర, యానాం, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం వుంది. తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల్లో నవంబర్ 10, 11, 15, 16 తేదీల్లో భారీ వర్ష సూచన.నవంబర్ 16న కేరళలోనూ అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం వుంది.. అండమాన్ నికోబార్ దీవుల్లో నవంబర్ 10 నుంచి 14 వరకు భారీ వర్ష సూచన.నవంబర్ 12న కశ్మీర్ లోయలో భారీ వర్షాలు, మంచు కురిసే అవకాశం వుంది. .తమిళనాడు పరిసరాల్లో గంటకు 40?50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం వుంది.

బియ్యం అక్రమ నిల్వలపై ఉక్కుపాదం మోపాలి!

అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి
జిల్లా అదనపు కలెక్టర్‌కు వినియోగదారుల సమాచార కేంద్రం వినతి



వరంగల్ । నవంబర్ 10 । జై భీమ్ న్యూస్

వరంగల్ జిల్లాలో బియ్యం అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఎల్. కిషోర్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఎల్‌నినో ప్రభావాన్ని సాకుగా చూపుతూ కొందరు వ్యాపారులు సన్నబియ్యాన్ని కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని, అధిక ధరలకు విక్రయిస్తున్నారని కమిటీ ప్రతినిధులు ఆరోపించారు. జిల్లాలోని రైస్ మిల్లులు, బియ్యం వ్యాపారుల నిల్వలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ నిల్వలు గుర్తించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ నిల్వలపై ఆకస్మిక దాడులు నిర్వహించి, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే బియ్యం ధరలు, తూకాల్లో జరుగుతున్న మోసాలను అరికట్టాలని, 26 కిలోల బస్తాలపై ముద్రించిన గరిష్ఠ చిల్లర ధర నిబంధనలను పాటించేలా పర్యవేక్షణ చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై పౌరసరఫరాల చట్టం ప్రకారం, వర్తించే ఇతర చట్టాల కింద చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలు, మైక్ ప్రచారం నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్, కన్వీనర్ ఎర్రబోయిన రాజశేఖర్, విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాగేల్లి సారంగం, వరంగల్ జిల్లా కార్పొరేషన్ కన్వీనర్ కోడిమాల శ్రీనివాసరావు, బోయిన్ వెంకటస్వామి, వెంకట్రామ్ నరసయ్య, హనుమకొండ జిల్లా కన్స్యూమర్ ఫోరం అధ్యక్షుడు ఠాకూర్ రతన్ సింగ్, విజిలెన్స్ కమిటీ సభ్యుడు విజయరావు, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట ఫాతిమా సెంటర్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

ప్రమాదాల నివారణకు రోడ్డుపై ట్రాఫిక్ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు..
నో రైట్ టర్న్, నో యూ టర్న్ బోర్డులు అమలు



కాజీపేట, నవంబర్ 10(జై భీమ్ క్రైమ్ న్యూస్)

కాజీపేట పట్టణంలోని ఫాతిమా సెంటర్ వద్ద రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు కాజీపేట ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఫాతిమా సెంటర్ వద్ద తాత్కాలికంగా రోడ్డుపై ట్రాఫిక్ కోన్లు, బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. అదేవిధంగా ట్రాఫిక్ రద్దీని తగ్గించి వాహనదారులు నిబంధనలను పాటించేలా నో రైట్ టర్న్, నో యూ టర్న్ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను గమనించి, ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా తమ ప్రయాణాలను కొనసాగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ప్రజల భద్రత, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా చేపట్టిన ఈ చర్యలకు వాహనదారులు, స్థానిక ప్రజలు సహకరించాలని కాజీపేట ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు ట్రాఫిక్ సమస్యను తగ్గించవచ్చని తెలిపారు.

నాపై వస్తున్న ఆరోపణలను విచారణతో నిగ్గుతేల్చండి..

రాష్ట్ర డీజీపీకి అగ్రి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య లేఖ

హైదరాబాద్, నవంబర్ 10(జై భీమ్ న్యూస్) :

తనపై వస్తున్న లైగింక వేధింపుల ఆరోసణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఖమ్మాంజ) ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌కు లేఖ రాశారు. తన ప్రతిష్టను దిగజార్చేందుకు ఉద్దేశపూర్వకంగానే ఈ కుట్ర పన్నారని ఆయన ఆరోపించారు. వాట్సాప్ చాట్‌లు, కాల్ హిస్టరీ వంటి ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయ బదిలీల విధానంలో భాగంగా సెప్టెంబర్ 11, న ఒక మహిళా ఫ్యాకల్టీని నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి బదిలీ చేసినట్లు వీసీ జానయ్య వివరించారు.

దోపిడీ కేసులో ఇద్దరికి పదేళ్లకు పైగా జైలు శిక్ష

ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి.. ప్రయాణికుల బంగారు ఆభరణాల దోపిడీ
పిఠాపురం కోర్టు తీర్పు.. ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా

కాకినాడ, నవంబర్ 10(జై భీమ్ న్యూస్) :

ఆటోలో ప్రయాణికులుగా నటించి ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి, ప్రయాణికులను బెదిరించి బంగారు ఆభరణాలు దోచుకున్న కేసులో ఇద్దరు నిందితులకు పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పదేళ్ల ఆరు నెలల చొప్పున జైలు శిక్ష విధించింది. ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం. బాబు తీర్పు వెలువరించారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ పర్యవేక్షణలో పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాలు, ప్రాసిక్యూషన్ వాదనలతో నిందితులకు శిక్ష పడింది. 2023 జూన్ 12న పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇద్దరు వ్యక్తులు ఆటోలో ప్రయాణికులుగా నటించి ఎక్కి, అనంతరం ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచారు. ఆ తర్వాత ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులను కత్తితో బెదిరించి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. బాధితురాలు అప్పికొండ మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 98/2023గా కేసు నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్లు 394, 506, 326, 324, 34తో పాటు ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ అబ్దుల్ నబీ కేసు నమోదు చేయగా, అప్పటి సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.ఆర్.కె. శ్రీనివాస్ దర్యాప్తు చేపట్టి న్యాయస్థానంలో పటిష్టమైన సాక్ష్యాధారాలను సమర్పించారు. ఈ కేసులో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కైలాష్ భగ్ అలియాస్ సన్నీ (28), ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సునెల్ సాహు అలియాస్ బాలికరణ్ సాహు (45) నిందితులుగా ఉన్నారు. ఎస్సీ నంబర్ 179/2024లో విచారణ చేపట్టిన పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం. బాబు నేరం రుజువు కావడంతో ఇద్దరికీ పదేళ్ల ఆరు నెలల చొప్పున జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధించారు. ఈ కేసులో పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. లక్ష్మణ దొర వాదనలు వినిపించారు. కోర్టు విచారణ సమయంలో నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచడం, విచారణకు అవసరమైన సమన్వయం, న్యాయపరమైన ప్రక్రియలను సక్రమంగా నిర్వహించడంలో ప్రస్తుత పిఠాపురం సీఐ జి.వి.వి. సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ షేక్ జాన్ భాషా, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వి.వి.వి. కిషోర్ విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ కేసు దర్యాప్తు చేసిన అప్పటి సీఐ వై.ఆర్.కె. శ్రీనివాస్, కేసు నమోదు చేసిన అప్పటి ఎస్ఐ అబ్దుల్ నబీ, ఏఎస్ఐ బి. లక్ష్మణ దొరతో పాటు ప్రస్తుత సీఐ జి.వి.వి. సత్యనారాయణ, ఎస్ఐ షేక్ జాన్ భాషా, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వి.వి.వి. కిషోర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. సమర్థవంతమైన దర్యాప్తు, పోలీసు శాఖ మరియు ప్రాసిక్యూషన్ మధ్య సమన్వయంతో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారుల సేవలను ప్రశంసించారు.



హైదరాబాద్‌లో క్లౌడ్ కిచెన్లపై టీజీ సేఫ్ ఫుడ్ వింగ్ మెరుపు దాడులు!









25 ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు.. కిచెన్లలో బొద్దింకలు, ఇతర కీటకాల గుర్తింపు
గడువు ముగిసిన సగ్గుబియ్యం, పురుగులు పట్టిన బొంబాయి రవ్వ స్వాధీనం.. కొన్ని కేంద్రాల మూసివేతకు చర్యలు

హైదరాబాద్, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)

నగరంలోని క్లౌడ్ కిచెన్లలో ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలను గుర్తించేందుకు టీజీ సేఫ్ ఫుడ్ వింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మొత్తం 25 ప్రత్యేక బృందాలతో నిర్వహించిన ఈ తనిఖీల్లో పలు క్లౌడ్ కిచెన్లలో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయి. తనిఖీల సందర్భంగా ఒక కిచెన్‌లో సుమారు 15 బాక్సుల ఫుడ్ కలర్స్ గుర్తించారు. అదేవిధంగా గడువు ముగిసిన సగ్గుబియ్యం నిల్వలు, బొద్దింకలు, ఇతర కీటకాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కూరగాయలను కట్ చేసేందుకు ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులను ఉపయోగిస్తున్నట్లు పరిశీలనలో వెల్లడైంది. బొంబాయి రవ్వలో కూడా పలు రకాల కీటకాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆహార పదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత విషయంలో నిబంధనలు పాటించకపోవడంపై అధికారులు తీవ్రంగా స్పందించారు. తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనల తీవ్రతను బట్టి కొన్ని క్లౌడ్ కిచెన్లను మూసివేయడంతో పాటు, మరికొన్ని కేంద్రాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు. నిబంధనల ప్రకారం అవసరమైన మార్పులు, మెరుగుదలలు చేపట్టాలని మరికొన్ని కేంద్రాలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో తనిఖీలు పూర్తయిన అనంతరం ఉల్లంఘనలకు పాల్పడిన కేంద్రాల వివరాలు, తీసుకున్న చర్యలపై పూర్తి సమాచారాన్ని మరో ప్రత్యేక పత్రికా ప్రకటన ద్వారా వెల్లడిస్తామని టీజీ సేఫ్ ఫుడ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తెలిపింది. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు.

కరీంనగర్‌కు నితిన్ నబీన్..
~~ఈ నెల 18న~~ కరీంనగర్‌కు నితిన్ నబీన్ రాక

కరీంనగర్: (జై భీమ్ న్యూస్)

తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ దూకుడు పెంచుతోంది. ఇందులో భాగంగా జాతీయ నాయకుల రాష్ట్ర పర్యటనలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈ నెల 18న ఆయన నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో లక్ష మందితో భారీ పాదయాత్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'సర్' అంశంపై కాంగ్రెస్, ఇండీ కూటమి పార్టీలు రాజ్యాంగ సంస్థలపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలు వివరించడమే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. నితిన్ నబీన్ తొలిసారి కరీంనగర్‌కు వస్తుండటంతో కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించాలని బండి సంజయ్ నిర్ణయించారు. గాంధీ సర్కిల్, వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ వరకు పాదయాత్ర సాగనుంది. ఇందులో నితిన్ నబీన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బండి సంజయ్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి లక్ష మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా మహా పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు బండి సంజయ్ కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో సమావేశమయ్యారు. బూత్ స్థాయి నుంచి మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను సమీకరించాలని సూచించారు. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల భాషా నైపుణ్య శిక్షణ తరగతులు

డిసెంబర్ 1 నుంచి జనవరి 8 వరకు ఆరు వారాల శిక్షణ
నవంబర్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలి: కేంద్రం సంచాలకురాలు డాక్టర్ ఆర్. మేఘన రావు

హన్మకొండ, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగంలోని ఆంగ్ల భాషా బోధనా కేంద్రం ఆధ్వర్యంలో ఆంగ్లంలో మాట్లాడే నైపుణ్యాలు, సమాచార మార్పిడి నైపుణ్యాల అభివృద్ధి కోసం ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకురాలు డాక్టర్ ఆర్. మేఘన రావు తెలిపారు. డిసెంబర్ 1 నుంచి 2027 జనవరి 8 వరకు ఆరు వారాల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థులు, విద్యార్థులు, గృహిణులు, బోధనేతర సిబ్బంది నవంబర్ 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా విశ్వవిద్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు రూ.200, ఇతర అభ్యర్థులకు రూ.1,500 శిక్షణ రుసుముగా నిర్ణయించినట్లు తెలిపారు. దరఖాస్తు పత్రం, పూర్తి వివరాల కోసం https://forms.gle/2wWndESyimUYcrYc7 వెబ్ లింక్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. శిక్షణ రుసుమును భారతీయ స్టేట్ బ్యాంక్ కాకతీయ విశ్వవిద్యాలయ శాఖలోని 'ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజ్ సెమినార్స్ అకౌంట్ కేయూ' పేరిట ఉన్న ఖాతాలో జమ చేయాలి. ఖాతా సంఖ్య: 45186108258, ఐఎఫ్ఎస్సీ కోడ్: కాదీ×చీ00020262. ఆంగ్ల భాషపై పట్టు సాధించడంతో పాటు మాట్లాడే నైపుణ్యాలు, వ్యక్తీకరణ సామర్థ్యం పెంపొందించుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఆర్. మేఘన రావు కోరారు. మరిన్ని వివరాల కోసం 9440601744 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జీవితంలో నమ్మకం, నవ్వు, బంధం, పోరాటమే మనిషికి నిజమైన బలం

అనుబంధాలను గౌరవిస్తూ, మానవత్వంతో జీవించాలి..
సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ మేడపాటి ఇమ్మానుయేల్

కాకినాడ, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)



మనిషి జీవితంలో అమ్మానాన్నల అండ, కుటుంబ అనుబంధాలు, ఆర్థిక భద్రత, ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమైనవని సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ మేడపాటి ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. అమ్మానాన్నలు ఉంటే మనకు కొండంత బలమని, ఆవులు, గేదెలు వంటి పశు సంపద ఉంటే ఆర్థికంగా లాభమని, సొంత ఇల్లు, వాకిలి ఉంటే జీవితానికి ఎంతో సౌకర్యమని వివరించారు. సులభమైన జీవితం గడపాలంటే సరైన ఆలోచన, ముందుచూపు, సమస్యలను పరిష్కరించుకునే ఉపాయం ఉండాలని, ఉపాయం ఉంటే అపాయం దరిచేరదని తెలిపారు. ఊపిరి ఉన్నంతవరకే మనిషి జీవన నాటకమని, ఈ ప్రయాణంలో ఏర్పడే రుణబంధాలు, అనుబంధాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని అన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండటం గొప్పతనమని, ఏ వేళలోనైనా ఇతరులను క్షమించే గుణం కలిగి ఉండటం దైవ నిర్దేశమని పేర్కొన్నారు. మనవారికే కాకుండా పరాయివారికి సైతం చేతనైనంత సహాయం చేస్తూ మానవత్వాన్ని చాటుకోవాలని సూచించారు. ఒంటరి సమయాల్లో ధైర్యంగా ఉండటమే విజయానికి మార్గమని, జీవితంలో పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, ఓడలు బండ్లు కావడం.. బండ్లు ఓడలు కావడం సహజమని గుర్తుంచుకోవాలన్నారు. పైకి మంచితనం ప్రదర్శిస్తూ మోసపూరితంగా వ్యవహరించడం వల్ల చివరకు నష్టమే ఎదురవుతుందని, అంతా అయిపోయిన తర్వాత బాధపడటం కంటే ముందుగానే అప్రమత్తంగా ఉండటం మంచిదని హితవు పలికారు. జీవితంలో నమ్మకం, నవ్వు, బంధం, పోరాటం అనే నాలుగు అంశాలు మనిషి ప్రయాణంలో అత్యంత విలువైనవని, వాటిని జీవితంలో భాగం చేసుకుంటూ కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలని డాక్టర్ మేడపాటి ఇమ్మానుయేల్ తన సందేశంలో వెల్లడించారు. మానవీయ విలువలను కాపాడుకుంటూ, అనుబంధాలకు ప్రాధాన్యతనిస్తూ, ధైర్యం మరియు సహాయగుణంతో జీవించినప్పుడే జీవితం సార్థకమవుతుందని ఆయన పేర్కొన్నారు.

మోడల్ కెరీర్ సెంటర్‌లో నవంబర్ 13న జాబ్ మేళా

నిరుద్యోగ యువతకు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు..
10వ తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత.. జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష

రాజమహేంద్రవరం, నవంబర్ 10(జై భీమ్ న్యూస్)



నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో తూర్పుగోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో నవంబర్ 13వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ సంస్థలైన యాక్ట్ ఫైబర్ నెట్, గణేష్ సెక్యూరిటీ సర్వీస్, కాలింగ్ బెల్ తదితర సంస్థలు పాల్గొని వివిధ ఉద్యోగ ఖాళీల భర్తీకి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని తెలిపారు. ఇంటర్వ్యూలలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆయా సంస్థల్లో తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ ఉద్యోగాలకు 19 నుంచి 38 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని, పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు పాల్గొనవచ్చని వివరించారు. సంబంధిత రంగాల్లో అనుభవం ఉన్నవారితో పాటు ఉద్యోగం చేయాలనే ఆసక్తి కలిగిన అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు. జాబ్ మేళాకు హాజరుకావాలనుకునే అభ్యర్థులు ముందుగా వఎజూశ్రీశీఎఎవత్.ఘజూ.స్ర్తశీజ.అఅ వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు. రిజిస్ట్రేషన్ అనంతరం రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో ఈ నెల 13వ తేదీన మోడల్ కెరీర్ సెంటర్‌కు నేరుగా హాజరుకావాలని కోరారు. నిరుద్యోగ యువతకు తమ విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు పొందేందుకు ఈ జాబ్ మేళా మంచి అవకాశమని, అర్హత కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సి.హెచ్. శిరీష విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోసం 9398318601 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

200 ఏళ్ల నాటి నవాబుల నగలు..


దీపావళికి కరీనా రాజసం!
దీపావళికి కరీనా కపూర్ రాజసం ఉట్టిపడే లుక్
200 ఏళ్ల నాటి భోపాల్ నవాబుల ఆభరణాలు ధరించిన నటి
ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కల్గి, 30 క్యారెట్ల పచ్చల హారం
సైఫ్ అలీ ఖాన్ కుటుంబ వారసత్వ సంపదగా వచ్చిన నగలు
పునిత్ బలానా డిజైన్ చేసిన సిల్వర్ కఫ్తాన్‌లో మెరిసిన కరీనా



బాలీవుడ్ నటి కరీనా కపూర్ ఈ ఏడాది దీపావళి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆధునిక ఫ్యాషన్‌కు రాజవంశపు వారసత్వాన్ని జోడించి, 200 ఏళ్ల నాటి భోపాల్ నవాబుల అమూల్యమైన ఆభరణాలను ధరించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ దీపావళి కోసం కరీనా ధరించిన ఆభరణాల్లో రెండు ముఖ్యమైనవి ఉన్నాయి. ఒకటి, 200 ఏళ్ల క్రితం నాటి భోపాల్ నవాబు ధరించిన 'కల్గి' (తలపాగాకు పెట్టుకునే ఆభరణం). మరొకటి, 30 క్యారెట్ల పచ్చల నెక్లెస్. ఈ పచ్చల హారంపై ఖురాన్‌లోని పవిత్ర వాక్యం 'ఆయతుల్ కుర్సీ' చెక్కి ఉండటం విశేషం. ఇదే కల్గిని గతంలో సైఫ్ అలీ ఖాన్ తన వివాహ వేడుకలోనూ, ఓ ఫోటోషూట్‌లోనూ ధరించాడు. ఈ విలువైన ఆభరణాలు సైఫ్ అలీ ఖాన్ కుటుంబం నుంచి వారసత్వంగా వచ్చినవి. సైఫ్ నాయనమ్మ, సాజిదా సుల్తాన్, భోపాల్ చివరి నవాబు కుమార్తె కావడంతో ఈ వారసత్వ సంపద వారి కుటుంబానికి చెందింది. ప్రముఖ డిజైనర్ పునిత్ బలానా రూపొందించిన సిల్వర్ కఫ్తాన్, మ్యాచింగ్ టర్బన్‌తో కరీనా కనిపించింది. స్టైలిస్ట్ రియా కపూర్ ఈ ప్రత్యేకమైన లుక్‌ను తీర్చిదిద్దారు. దీపావళి సందర్భంగా భర్త సైఫ్, కుమారులు జైమూర్, జెహ్‌తో కలిసి దిగిన కుటుంబ ఫోటోలను కరీనా సోషల్ మీడియాలో పంచుకున్నారు. మొత్తంగా, ఆధునిక దుస్తులతో పాటు చారిత్రక ఆభరణాలను కలిపి ధరించడం ద్వారా కరీనా తన దీపావళి లుక్‌కు ఒక ప్రత్యేకతను తీసుకొచ్చింది.

ఎల్ఏసీఎంఏ గాలాలో హృతిక్...

అరుదైన ఘనత సాధించిన తొలి భారత నటుడిగా రికార్డ్
లాస్ ఏంజిల్స్ ఎల్ఏసీఎంఏ గాలాలో పాల్గొన్న
తొలి భారత నటుడిగా హృతిక్
రెడ్ కార్పెట్‌పై నమస్కారంతో అందరినీ ఆకట్టుకున్న వైనం
హాలీవుడ్ దర్శకుడు డెనిస్ విల్లెన్యూవ్, నికోల్ కిడ్‌మాన్‌లతో ఫొటోలు
ప్రతిష్ఠాత్మక వేడుకలో సహ-చైర్‌గా లియోనార్డో డికాప్రియో
త్వరలో క్రిష్ 4 చిత్రంతో దర్శకుడిగానూ అరంగేట్రం



బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవాన్ని అందుకున్నాడు. లాస్ ఏంజిల్స్‌లో ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఎల్ఏసీఎంఏ ఆర్ట్ ం ఫిల్మ్ గాలాకు హాజరైన తొలి భారతీయ నటుడిగా చరిత్ర సృష్టించాడు. నవంబర్ 7న జరిగిన ఈ 15వ వార్షికోత్సవ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ కార్యక్రమానికి హృతిక్ ఇటాలియన్ లగ్జరీ బ్రాండ్ 'బ్రునెల్లో కుసినెల్లి' డిజైన్ చేసిన డార్క్ బ్లూ టక్సెడోలో హాజరయ్యాడు. రెడ్ కార్పెట్‌పై ఫొటోగ్రాఫర్లకు రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టి, భారతీయ సంస్కృతిని చాటాడు. ఈ దృశ్యాలు, అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రముఖ హాలీవుడ్ నటుడు లియోనార్డో డికాప్రియో సహ-చైర్‌గా వ్యవహరించే ఈ గాలా ఆర్ట్, సినిమా రంగాలను ప్రోత్సహించడానికి నిధులు సేకరిస్తుంది. ఈ ఏడాది ఈ వేడుక ద్వారా దాదాపు 70 లక్షల డాలర్లు సమీకరించారు. ఈ ఈవెంట్‌లో హృతిక్‌తో పాటు టామ్ హ్యాంక్స్, కిమ్ కర్దాషియన్, ఆండ్రూ గార్‌ఫీల్డ్, తిమోథీ చలమెట్ వంటి అనేక మంది హాలీవుడ్ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుకలో హృతిక్‌ను భారత సంతతికి చెందిన నిర్మాత కవితా గుప్తా హోస్ట్ చేశారు. 'డ్యూన్' చిత్ర దర్శకుడు డెనిస్ విల్లెన్యూవ్, నటి నికోల్ కిడ్‌మాన్‌లతో హృతిక్ దిగిన ఫొటోలు కూడా వైరల్ అయ్యాయి. ఇక సినిమాల విషయానికొస్తే, ఇటీవల 'వార్ 2'తో విజయం సాధించిన హృతిక్, త్వరలో 'క్రిష్ 4' చిత్రంతో నటుడిగా, దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్నాడు.

అక్కినేని ఇంట దీపావళి వెలుగులు



నాగచైతన్యతో శోభిత స్పెషల్ ఫొటోలు
దీపావళి ఫొటోలను షేర్ చేసిన శోభిత
నాగచైతన్య, నాగార్జునతో కలిసి వేడుకలు
అక్కినేని కుటుంబంతో ప్రత్యేక ఫొటోలు
నల్లటి సంప్రదాయ దుస్తుల్లో శోభిత సందడి
తన ఫొటో ఉన్న తారాజువ్వల పెట్టె ప్రత్యేక ఆకర్షణ

నటి శోభిత ధూళిపాళ్ల తన దీపావళి వేడుకలకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకుంది. భర్త నాగచైతన్యతో పాటు మామ నాగార్జున, అక్కినేని కుటుంబ సభ్యులతో కలిసి పండగను జరుపుకొన్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. శోభిత షేర్ చేసిన ఫొటోల్లో నాగచైతన్యతో కలిసి అక్కినేని కుటుంబ సభ్యులు, సన్నిహితులతో ఆమె కనిపించింది. ఈ ఫొటోలో నటుడు నాగార్జున కూడా ఉన్నాడు. ఇంట్లో జరిగిన దీపావళి వేడుకలకు సంబంధించిన మరికొన్ని చిత్రాలను కూడా ఆమె అభిమానులతో పంచుకుంది. పండగ కోసం శోభిత నల్లటి సంప్రదాయ దుస్తులను ధరించింది. వాటిపై బంగారు రంగు ఎంబ్రాయిడరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇంట్లో పూలతో చేసిన అలంకరణలు, కొవ్వొత్తులు, ప్రమిదలు, రంగవల్లుల ఫొటోలను షేర్ చేసింది. రంగవల్లుల చుట్టూ దీపాలు వెలిగిస్తున్న చిత్రాన్ని కూడా పోస్ట్ చేసింది. పండగ విందులో భాగంగా నూడుల్స్ ఫొటోను సైతం పంచుకుంది. ఇక తన ఫొటో ముద్రించిన తారాజువ్వల పెట్టెను చూపిస్తూ శోభిత చేసిన పోస్ట్ ఆసక్తికరంగా మారింది. దీనిపై Another Diwali Another slay అంటూ సరదాగా క్యాప్షన్ ఇచ్చింది. చివరిగా 'అందరికీ దీపావళి శుభాకాంక్షలు' అంటూ అభిమానులకు పండగ శుభాకాంక్షలు తెలిపింది. నాగచైతన్య, శోభిత 2024 డిసెంబర్ 4న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వివాహం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో సంప్రదాయ తెలుగు పద్ధతిలో వీరి పెళ్లి జరిగింది. అంతకుముందు నాగచైతన్య నటి సమంతను 2017లో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 2021లో ఇద్దరూ విడిపోతున్నట్లు ప్రకటించారు.

దీపావళి పోస్ట్‌తో చిక్కుల్లో ప్రియాంక చోప్రా..

ఫొటోలు చూసి ఫైర్ అవుతున్న నెటిజన్లు!
దీపావళి వేడుకలపై ట్రోలింగ్‌కు గురైన ప్రియాంక చోప్రా
పండుగ రోజు నాన్-వెజ్ తినడంపై నెటిజన్ల అభ్యంతరం
లాస్ ఏంజిల్స్‌లోని ఇంటి వేడుకల ఫొటోలు షేర్ చేయడంతో విమర్శలు



గ్లోబల్ ఐకాన్‌గా గుర్తింపు పొందిన నటి ప్రియాంక చోప్రా జోనాస్, తాజాగా సోషల్ మీడియాలో విమర్శల పాలయ్యారు. దీపావళి వేడుకల్లో భాగంగా ఆమె మాంసాహారం తింటున్నట్లు కనిపించడమే ఇందుకు కారణమైంది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో ఉన్న తన నివాసంలో జరిగిన దీపావళి వేడుకలకు సంబంధించిన ఫొటోలను ప్రియాంక సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ ఫోటోలలో డెకరేషన్, ఫ్యామిలీతో పాటు ఫుడ్ ఐటమ్స్ కూడా ఉన్నాయి. అయితే, వాటిలో ఒక ఫొటోలో ప్రియాంక నాన్-వెజ్ పదార్థం తింటున్నట్లు కనిపించడంతో నెటిజన్లు ఆమెను టార్గెట్ చేశారు. పండుగ రోజు మాంసాహారం తినడం ఏంటని ప్రశ్నిస్తూ కామెంట్ల వర్షం కురిపించారు. "దీపావళి రోజు నాన్-వెజ్ తినకూడదు", "మీరు దీపావళి నాడు మాంసాహారం తింటున్నారా?", "దీపాలకు బదులు కొవ్వొత్తులు ఎందుకు?" అంటూ కొందరు నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. మరికొందరు ఆమె డ్రెస్సింగ్, హెయిర్ స్టైల్‌పైనా విమర్శలు చేశారు. అయితే, ప్రియాంక విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ భారతీయ సంప్రదాయాలను, పండుగలను ఎంతగానో గౌరవిస్తారన్న విషయం తెలిసిందే. ఇటీవల దసరా పండుగను కూడా తన ఇంట్లో ఘనంగా జరుపుకొన్నారు. ఆ సమయంలో ప్రత్యేక పూజలు, శివలింగ అభిషేకం, హోమం, కన్యా పూజ వంటివి నిర్వహించారు. తన కూతురు మాలతి మేరీ పాదాలను భర్త నిక్ జోనాస్ కడుగుతున్న ఫొటోను కూడా ఆమె పంచుకున్నారు. అంతేకాదు మాలతికి తరచూ హిందూ శ్లోకాలను నేర్పిస్తూ భారతీయ సంస్కృతికి దగ్గరగా పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు ప్రియాంకకు మద్దతుగా నిలుస్తుండగా, దీపావళి ఫుడ్ మెనూపై మాత్రం చర్చ కొనసాగుతోంది.

ఓవైపు పవన్ విడాకుల వార్తల హోరు..

మరోవైపు రేణు దేశాయ్ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ వైరల్!
దీపావళి తర్వాత కూడా అర్ధరాత్రి టపాసులు పేల్చడంపై రేణూ దేశాయ్ ఆగ్రహం
శబ్దాల వల్ల పసిపిల్లలు, వృద్ధులు, రోగులు ఇబ్బంది పడతారని ఆవేదన
తాత్కాలిక ఆనందం కోసం ఇతరులను బాధపెట్టడం స్వార్థమంటూ వ్యాఖ్య



నటి రేణూ దేశాయ్ మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే, ఈసారి వ్యక్తిగత విషయాల వల్ల కాకుండా, ఒక సామాజిక అంశంపై తనదైన శైలిలో స్పందించి అందరి దృష్టిని ఆకర్షించారు. దీపావళి పండుగ ముగిసి రోజులు గడుస్తున్నా, కొందరు ఇంకా అర్ధరాత్రి వేళల్లో టపాసులు పేల్చడంపై ఆమె తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పెట్టిన పోస్ట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గత మూడు రోజులుగా రాత్రి 11 గంటలకు కూడా టపాసులు కాలుస్తున్నారని, తన స్నేహితులు చెప్పిన ప్రకారం కొన్ని ప్రాంతాల్లో అర్ధరాత్రి 1, 2, 3 గంటల వరకు కూడా ఈ శబ్దాలు కొనసాగుతున్నాయని రేణూ దేశాయ్ తన పోస్టులో పేర్కొన్నారు. "అసలు ఏ పండుగ కోసం ఈ సంబరాలు? దయచేసి రాత్రి 9 గంటలకు, మహా అయితే 10 గంటలకల్లా ఈ వేడుకలు ముగించండి" అని ఆమె విజ్ఞప్తి చేశారు. తన ఆందోళన పర్యావరణం గురించి కాదని, సాటి మనుషుల పట్ల సానుభూతితో ఆలోచించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ భారీ శబ్దాల వల్ల నవజాత శిశువులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని రేణు దేశాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. "కొద్దిసేపటి తాత్కాలిక ఆనందం కోసం ఇతరుల బాధను, కష్టాన్ని పట్టించుకోనంత స్వార్థపరులుగా, మూర్ఖులుగా మనం మారిపోయాం" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. దీపావళి రోజున తాను ఈ విషయంపై మాట్లాడితే 'హిందూ వ్యతిరేకి' అనే ముద్ర వేస్తారనే ఉద్దేశంతోనే మౌనంగా ఉన్నానని ఆమె వివరించారు. ఏపీ డిప్యూటీ సీఎం, తన మాజీ భర్త పవన్ కల్యాణ్ తన మూడో భార్య అన్నా లెజినోవాతో విడాకుల వార్తలు ఓవైపు హోరెత్తుతుండగా, మరోవైపు రేణూ దేశాయ్ ఈ సామాజిక అంశంపై పోస్ట్ చేయడం గమనార్హం. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తల మధ్య, ఆమె ఒక సామాజిక బాధ్యతతో చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. పండుగల పేరుతో శబ్ద కాలుష్యం సృష్టించడంపై మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని రేణూ దేశాయ్ పోస్ట్ గుర్తుచేసింది.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM